

గండ దీపం వద్ద మొక్కుతున్న మహిళలు



వరినాట్లకు వలస కూలీలు

- మహారాష్ట్ర, బెంగాల్, బీహార్, యూపీ నుంచి కూలీల రాక
- గ్రామాల్లోనే బస... రోజుకు నాలుగైదు ఎకరాల్లో నాట్లు
- 15 రోజుల్లో పూర్తి కానున్న వరినాట్లు

కరీంనగర్ టౌన్/కరీంనగర్ రూరల్, ఆగస్టు 5: ఒకప్పుడు గ్రామాల్లో వరినాట్లు మొదలయ్యాయంటే సందడి నెలకొనేది. ముఖ్యంగా మహిళలు వేరే పనికి వెళ్లకుండా నాట్లపైనే దృష్టి పెట్టేవారు. ఇప్పుడు అందుకు భిన్నమైన వాతావరణం పల్లెల్లో చోటు చేసుకుంది. వరి నాట్లు వేసేందుకు కూలీలు దొరకక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రెండు, మూడేళ్లుగా రైతులు వలస కూలీలు, యాంత్రాలపైనే ఆధారపడుతున్నారు. యంత్రాల కొరత, యంత్రాలు కొన్ని భూముల్లో నాట్లు వేసే పరిస్థితి లేక పోవడంతో మనుషులతో నాట్లు వేయిస్తే పంట ఎక్కువగా వస్తుందని రైతులు కూలీల కోసం ఎదురు చూస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన గడ్చిరోలి, చంద్రాపూర్, పశ్చిమబెంగాల్, బీహార్, ఉత్తర ప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి కార్మికులు వరి నాట్లు వేసేందుకు గ్రామాలకు వలస వస్తున్నారు. కొంత మంది స్థానికులు అయా ప్రాంతాలకు చెందిన వలస కార్మిక ులను గ్రామాలకు తీసుకువచ్చి వారికి ఆశ్రయం కల్పిస్తున్నారు. వారితో ఎకరాకు ఒక ధరను ఒప్పందం చేసుకొని రైతుల నుంచి ఎక్కువ మొత్తం తీసుకొని వరి నాట్లు వేయిస్తున్నారు. ఒక సంవత్సరం స్థానికుల సహకారంతో వరినాట్లు వేసేందుకు గ్రామా లకు వచ్చిన వలస కూలీలు ఈయేడు స్థానికుల ప్రమేయం లేకుండా స్వయంగా వారే గ్రామాలకు వచ్చారు.

వలస కూలీలకు మంచి డిమాండ్

అలస్యంగా వర్షాలు కురవడంతో నాట్లు ఆలస్యమయ్యాయి. ఒక్కసారిగా రైతులంతా వరి నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో వలస కూలీలకు మరింత డిమాండ్ పెరిగింది. కరీంనగర్, హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో ఇప్పటికే వలస కూలీలు వరి నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. మరో 10, 15 రోజుల్లో వరి నాట్లు పూర్తి చేయాల్సి ఉండడంతో వలస కూలీలకు మరింత డిమాండ్ పెరిగింది. కరీంనగర్ రూరల్ మండలానికే 18 మందితో కూడిన వలస కూలీల గ్రూపులు 15 రాగా, జిల్లా వ్యాప్తంగా దాదాపు ఐదు వేల మంది వరకు వరి నాట్ల కోసం వచ్చినట్లు సమాచారం.

ఒక్కో బృందంలో 18 మంది

ఒక్కో బృందంలో నలుగురు పురుషులు, 14 మంది మహిళా కూలీలు ఉంటున్నారు. నాటు వేసేందుకు ఎకరాకు ఐదు వేల నుంచి 5,500, డిమాండ్ అధికంగా ఉన్న గ్రామాల్లో ఆరు వేల రూపాయల వరకు తీసుకుంటున్నారు. 18 మందితో ఉన్న ఒక గ్రూప్ రోజుకు నాలుగు నుంచి ఐదు ఎకరాల్లో వరి నాట్లు వేస్తుంది. నలుగురు పురుషులు వరి నారును మోసి వరుసల్లో పెడితే మహిళలు నాటు వేస్తారు. డిమాండ్ బట్టి ఒక్కో రైతుకు ఒక్కో తేదీ ఇస్తూ బుకింగ్ చేసుకొని వరి నాట్లు వేస్తున్నారు. వీటికి తోడు పత్తి చేనులో కలుపు తీస్తుండడంతో కూలీలకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. గ్రామాల్లోని కూలీల్లో సగం మంది పత్తి కలుపు తీసేందుకు, మరికొంత మందివారికి తెలిసిన వారి పొలాల్లో నాట్లు వేసేందుకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో వలస కూలీలు కూడా గత ఏడాది కంటే ఈసారి ఎకరాకు 500 కూలీ పెంచారు. డబ్బులు పోయినా పర్వాలేదు కానీ సకాలంలో నాట్లు వేయాలనే ఆలోచనతో రైతులు వలస కూలీలకు అడిగినంత డబ్బు ఇచ్చి నాట్లు వేయించుకుంటున్నారు. వీరి రాకతో కూలీల కొరత తీరిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వలస కూలీలతో కొరత తీరింది

- పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, రైతు సంఘాల ప్రతినిధి

వానలు ఆలస్యంగా పడడంతో రైతులంతా ఒకేసారి వరి నాట్లకు సిద్ధమయ్యారు. దీంతో గ్రామాల్లో కూలీల కొరత తీవ్రంగా ఉంది. ఈపరిస్థితిలో ఇతర రాష్ట్రాల నుంచి వరి నాట్లు వేసేందుకు మహిళలు, పురుషులు రావడంతో పల్లెల్లో కొరత తీరింది. వీరు నాట్లు త్వరగా వేస్తున్నారు. డబ్బులు పోయినా పర్వాలేదనే అభిప్రాయంతో చాలా మంది రైతులు వలస కూలీలతో నాట్లు వేయించుకుంటున్నారు.



ప్రారంభమైన శ్రావణ సందడి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 5: శ్రావణ మాసం సోమవారం నుంచి ప్రారంభం కావడంతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఉపవాసాలు పాటిస్తూ పూజలు నిర్వహించి అర్చనలు చేయించుకున్నారు. గృహాలను అలంకరించుకుని పూజా మందిరాలను శుభ్రం చేసి నైవేద్యాలు సమర్పించారు. మరి కొందరు భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు పొరుగు జిల్లాల్లో ఉన్న తీర్థ, క్షేత్రాలకు తరలి వెళ్లారు. సాయంత్రం వేళల్లో ఆలయాల్లో భజనలు, భగవన్నామ సంకీర్తనలు ప్రారంభమయ్యాయి. ఈ మాసంలో వచ్చే సోమ, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలు ఆచరించి ఉపవాసాలు పాటించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. మాసం ప్రారంభం రోజే ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం చోటు చేసుకుంది.



పాతబజార్ శివాలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ప్లాస్టిక్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దుతాం



అన్నారంలో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్, ఆగస్టు 5 : జిల్లాను ప్లాస్టిక్ ఫ్రీ గా తీర్చిదిద్దుతామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండలంలోని అన్నారం గ్రామపంచాయితీ కార్యాలయంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 5 నుంచి 9వరకు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. స్వశక్తి సంఘాల సభ్యులందరూ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 740 మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించామని, వాటన్నింటిని వెంటనే మార్కింగ్ చేస్తామని తెలిపారు. 6న గ్రామంలో ప్రజలకు నల్లా ద్వారా సరఫరా చేసే మంచినీటిపై అవగాహన కల్పిస్తామన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేస్తామని తెలిపారు. 7న పరిసరాలను పరిశుభ్రం చేయడం, 8న జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో జ్వర సర్వే చేపడతామన్నారు. 9న ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టడడం జరుగుతుందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టాలని సూచించారు. ఇళ్లలో తడి-పొడి చెత్తను వేరు చేసే పద్ధతిని పిల్లలందరు తమ తల్లిదండ్రులకు చెప్పి ఆచరించేలా చూడాలన్నారు. ఖాళీ స్థలంలో కూరగాయల పంటలను పండించుకొని ఎరువులు లేని ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హెర్బల్ కిచెన్ గార్డెన్ పెంచాలని సూచించారు. ముగ్గులు, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్డీవో పీడీ శ్రీధర్, డీఈవో జనార్దన్‌రావు, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

బల్దియా పారిశుధ్య కార్మికులు, డ్రైవర్ల టోకెన్ సమ్మె

- నిలిచిన చెత్త సేకరణ
- అధికారుల లిఖిత పూర్వక హామీతో సమ్మె విరమణ



మున్సిపల్ వెహికిల్ షెడ్ ఆవరణలో సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లు,

కరీంనగర్ టౌన్, ఆగస్టు 5: నగరపాలక సంస్థ పారిశుధ్య విభా గానికి చెందిన వాహనాలకు వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లు టోకెన్ సమ్మె చేశారు. సోమవారం కార్మికులు, డ్రైవర్లు విధులను బహిష్కరించి సప్తగిరికాలనీలోని మున్సిపల్ వెహికిల్ షెడ్ ఆవరణలో సమ్మె చేశారు. దీంతో పారిశుధ్య విభాగానికి చెందిన వాహనాలన్నీ ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. చెత్తసేకరణ ప్ర క్రియ ఆగింది. బీఆర్టీయూ అనుబంధ మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి టోకెన్ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్టీయూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రూప్‌సింగ్ మాట్లాడుతూ వాహనాలకు మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో తప్పనిసరి పరిస్థితిలో సమ్మె చేయాల్సి వచ్చిందన్నారు. వాహనాలను మరమ్మతులు చేయాలని, కార్మికుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు మాట్లాడుతూ వాహనాలకు మరమ్మతులు చేయాలని కోరుతూ నగర పాలక సంస్థ కమిషనర్, మేయర్‌కు వినతిపత్రం సమర్పించి 18 నెలలు గడుస్తున్నా స్పందించలేదన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తూ వెంటనే వాహనాలకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అందుబాటులో లేకపోవడంతో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, డీఈ ఓంప్రకాశ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి, అసిస్టెంట్ ఇంజనీర్ గట్టుస్వామి కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చించారు. 15 రోజుల్లో వాహనాలకు మరమ్మతులు చేయిస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారు. దీంతో సమ్మె విరమించి మంగళవారం నుంచి యథావిధిగా పనుల్లో చేరుతామని కార్మిక సంఘాల ప్రతినిధులు ప్రకటించారు.



విద్యుత్ ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

విద్యుత్ ప్రజావాణికి ఎనిమిది ఫిర్యాదులు

గణేశ్‌నగర్, ఆగస్టు 5: టీజీ ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వాహించిన విద్యుత్ ప్రజావాణిలో ఎనిమిది ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ ఫిర్యాదులను సంబంధిత సెక్షన్లకు కార్యాలయాలకు పంపించి తక్షణమే పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈటీ విజయేందర్‌రెడ్డి, ఏడీఈ స్వప్న, ఎస్ఏవో రాజేశం పాల్గొన్నారు.

వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించాలి



ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సహాయ కార్యదర్శి శనిగరపు రజనీకాంత్

భగత్‌నగర్, ఆగస్టు 5: వసతి గృహాల్లోని సమస్యలను పరిష్క రించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి శనిగరపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. కరీంనగర్ మంకమ్మతోటలోని కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం సోమవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ రాష్ట్ర వ్యా ప్తంగా ఏడు వేల కోట్ల రూపా యల స్కాలర్‌షిప్స్, రీ యింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నాయన్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో అద్దె భవనాలల్లో విద్యార్థులు అవస్థలుపడుతున్నారని తెలిపారు సంక్షేమహాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.సీజనల్ వ్యాధులు వస్తున్న దృష్ట్యా వసతి గృహాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. వెంటనే విద్యాశాఖమంత్రిని నియమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, పక్కపెల్లి పూజ, పొడిశెట్టి అభిలాష్, వినయ్, శ్రీజ, ఇసాక్, రత్నం సురేష్, గట్టుఅకాశ్, రక్షక్, సుధీర్ పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పును పునఃసమీక్షించాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 5: ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు పునఃసమీక్షించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు కోరారు. సోమవారం సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగబద్ధంగా లేదన్నారు. ఈవీ చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. రాజ్యాంగంలోని 341 అధికరణకు సవరణలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. ఎస్సీ, ఎసీలకు సంబంధించి ఏమైనా రాజ్యంగ మార్పులు, నిర్ణయాలు తీసుకోవాలనుకుంటే రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి అని తెలిపారు. ఈ అంశాలను పరిశీ లించకుండా ప్రస్తుత ధర్మాసనం రాజ్యాగ ఆదేశ సుత్రాలకు ప్రతికూలమైన తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పును పునఃసమీక్షించాలని కోరారు. కార్య క్రమంలో కాడే శంకర్, మేడి మహేశ్, తాళ్ల వెంకటేష్, ఎలుక ఆంజ నేయులు, మేడి అంజ య్య, దామెర సత్యం, కూడ కనకయ్య, మామిడి విద్యాసాగర్, గొట్టె అర్జున్, తాళ్ళ శ్రీనివాస్, జక్కుల బాబు, మదునాల రవీందర్, తాళ్ళ చంద్రశేఖర్, గరిగె ప్రభాకర్, ఎట్టి కనకయ్య, పల్నాటి చంద్రయ్య, కునమల్ల చంద్రయ్య, ముక్క రవి, మొగురం రవి, మొగురం అజయ్, బత్తుల నర్సింగం పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

ఓదెల, ఆగస్టు 5: మండల కేంద్రంలో జండా వద్ద రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం పట్టుకున్న నల్లవేని శంకర్ విద్యుదా ఘాతంతో కిందపడిపోయాడు. అక్కడ ఉన్న మెడికల్ షాప్ వద్దకు మందుల కోసం వచ్చిన శంకర్ అనుకోకుండా విద్యుత్ స్తంభాన్ని పట్టుకోవడంతో ప్రమాదం జరిగింది. కిందపడి పోయిన శంకర్‌ను సమీపంలోని యువకులు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రమాదక రంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని అక్కడినుంచి తొలగించాలని తెలిపినప్పటికీ ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొన్నారు. దీనిపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.








మొరాయించిన రైల్వే గేట్

● అరగంటకు పైగా నిలిచిన రాకపోకలు

మల్యాల, ఆగస్టు 5: మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలోని రామన్నపేటకు వెళ్లే మార్గంలో గల రైల్వే గేట్ సోమవారం సాయంత్రం మొరాయించింది. రైలు రావడంతో అక్కడి సిబ్బంది గేట్లు వేశారు. అయితే రైలు వెళ్లాక అరగంట గడిచినప్పటికీ గేట్లు తెరచుకోకపోవడంతో ఇరువైపుల వాహనాలు, స్కూల్‌బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైలు పట్టాల మధ్య సాంకేతిక లోపం ఏర్పడడంతో గేట్లు తెరచుకోలేదని గేట్‌మన్ తెలిపాడు. పట్టాల మధ్య సరి చేశాక కాసేపటికీ గేట్లు తెరచుకోవడంతో వాహనదారులు వెళ్లిపోయారు. కొన్ని నెలల క్రితం కూడా ఇలాగే గేట్లు మొరాయించాయి.


చీటి వ్యాపారిపై కేసు నమోదు

మల్లాపూర్, ఆగస్టు 5 : మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన ఆకుల గంగాధర్‌గౌడ్ చీటి వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మొగిలిపేట గ్రామంలో ఆకుల గంగాధర్‌గౌడ్ చీటి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గ్రామానికి చెందిన సంగం పెద్దగంగారాం, ముక్కెర లక్ష్మీ కట్టిన చీటి డబ్బులు చెల్లించాలని గంగాధర్‌గౌడ్‌ను పలుమార్లు బాధితులు కోరగా తనకే ఇంకా డబ్బులు రావాల్సి ఉందని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సంఘం పెద్ద మనిషి పెద్దగంగారాం మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

























బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డి, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

తిరుమల తిరుపతి తరహాలో

బ్రేక్ దర్శనం అమలు

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 5 : తిరుమల తిరుపతి తరహాలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం బ్రేక్ దర్శనం అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజన్న ఆలయంలో శ్రావణమాసం మొదటి రోజు సోమవారం బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను ఆలయ ఈవో వినోద్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ బ్రేక్ దర్శనం టికెట్ కొనుగోలు చేసి క్యూలైన్ ద్వారా రాజన్న ఆలయంలోకి ప్రవేశించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు శీఘ్ర దర్శనం కలిగేలా ఒక మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. యాదాద్రి తిరుమలతిరుపతి దేవస్థానం తరహాలో వేములవాడ రాజన్న ఆలయంలో కూడా ప్రతి భక్తుడికి శీఘ్రదర్శనం కలిగేలా బ్రేక్ దర్శనం సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ప్రతీ రోజు ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు బ్రేక్ దర్శనం ఉంటుందని తెలిపారు.

రాజన్న ఆలయానికి గత పాలకులు ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తామని మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి మూడు నెలల్లోనే వీటీడీఏ సమావేశం ఏర్పాటు చేసి రూ. 20 కోట్లు నిధులు వెనక్కి తీసుకొచ్చామన్నారు. మొన్నటి బడ్జెట్ రాజన్న ఆలయానికి రూ.50 కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, నాయకులు సాగరం వెంకటస్వామి, సంఘస్వామి యాదవ్, కనికరపు రాకేష్, తూం మధు, గూడూరి మధు, పుల్కం రాజు, ఇప్పపూల అజయ్, అన్నారం శ్రీనివాస్ ఉన్నారు.

రాజన్న ఆలయానికి శ్రావణ శోభ

వేములవాడ కల్చరల్: రాజన్న ఆలయం శ్రావణ శోభ సంతరించుకుంది. శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రారంభించిన బ్రేక్ దర్శనం ద్వారా మొదటి రోజున 96 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మహాలింగార్చన

శ్రావణ సోమవారం సందర్భంగా అర్చకులు ఉదయం 5.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారి కల్యాణ మండపంలో సాయంత్రం 6.05లకు లింగాకృతిలో దీపాలను వెలిగించి మహాలింగార్చన చేపట్టారు. ఆలయ ఓపెన్ స్లాబ్‌లో నైమిశారణ్య పీఠం పూజ్యా శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి భక్తులకు శివలీల విలాసం ప్రవచనం వినిపించారు.



ప్రవచనం వినిపిస్తున్న శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి

ధర్మపురిలో శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం

ఆలయాల్లో భక్తుల రద్దీ

ధర్మపురి, ఆగస్టు 5: ధర్మపురి క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకుని మొదటి సోమవారం స్థానిక లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీ ఉగ్ర నరసింహ, వేం కటేశ్వర, రామలింగేశ్వర స్వామి, గణపతి ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. రామలింగేశ్వర స్వామి వారలకు మహారుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీని వాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీని వాసాచారి, రమణాచార్య, నంబి నరసింహమూర్తి, ద్యావళ్ల విశ్వనాథశర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభి షేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

శివుడికి భక్తి శ్రద్ధలతో పూజలు

రామలింగేశ్వర స్వామి, సమీపంలో గల అక్కపల్లి రాజరాజేశ్వరుని ఆలయం వద్ద భక్తుల రద్దీ పెరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి అర్చకులు రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు, అన్నపూజ నిర్వహించారు. అంతకు ముందు గోదావరి నదిలో స్నానాలు చేసి, ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు క్యూలైన్ ద్వారా వెళ్లి స్వామి వారలను దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్ శర్మ, అర్చకులు విశ్వనాథశర్మ, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొండగట్టులో శ్రావణ సప్తాహ ఉత్సవాలు

మల్యాల, ఆగస్టు 5: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాస సప్తాహ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ప్రధాన ఆలయ మండపంలో విశ్వక్సేనా రాధన, వాసుదేవ పుణ్య హవచనం, రక్షబంధనం, రుత్విక్‌వరుణం, దీక్ష స్వీకరణ, ఆంజనేయ స్వామికి పంచామృతా భిషేకం,తుళసీదళర్చాన, వెంకటేశ్వరస్వామి, అమ్మవారికి అభిషేకార్చన నిర్వహించారు. సాయంకాలం అమ్మవారికి సహస్రనామా కుంకుమార్చన, వేంకటేశ్వర స్వామికి తిరువీధి సేవ నిర్వహించిన అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.ఈ ఉత్సవాలలో ఏఈవో అంజయ్య, స్థానాచార్యులు కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, అధికారులు సునీల్, చంద్రశేఖర్, సంపత్, ఉమామహేశ్వర్, రాజేందర్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొనసాగుతున్న నీటి విడుదల

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 5: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు ప్రాజెక్టులోకి 7,822 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది పంప్ హౌస్ నుంచి మూడు మోటార్ల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరులోకి ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.091 టీఎంసీలు ఉన్నది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గిపోవడంతో నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం సాయంత్రం నుంచి ఒక మోటార్ నిలిపి వేసి మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. సోమవారం నాలుగు పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో తగ్గడంతో సోమవారం అర్ధరాత్రి నుంచి ఒక పంపును నిలిపివేసి మూడు పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. మొదటి రెండు రోజులు ఐదు పంపుల ద్వారా రోజుకు 15,750 క్యూసెక్కుల విడుదల చేశారు. మూడో రోజు నుంచి తొమ్మిదో రోజు వరకు నాలుగు పంపాల ద్వారా రోజుకు 12,600 క్యూసెక్కుల నీటిని తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్ హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 9.8 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12600 క్యూసెక్కులు, మానేరు, ములవాగు ద్వారా 200 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.533 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు ప్రారంభం

ఇల్లంతకుంట: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు సోమవారం ప్రారంభయయ్యాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.76 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. మధ్యమానేరులో 10.03 టీఎంసీల నీరు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎత్తిపోతలను ప్రారంభించింది. రెండు మోటార్ల ద్వారా 6,400 టీఎంసీల నీటిని ప్రతీ రోజు అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయడం ప్రారంభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి విడుదలవుతున్న నీరు

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం ఎస్సారెస్పీలోకి 13,167 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 44.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సివిల్ సప్లయిస్ అధికారుల నిర్లక్ష్యం

- రూ. 2కోట్ల ప్రభుత్వ ధాన్యాన్ని అమ్ముకున్న వ్యాపారి...?
- సీఎంఆర్ ధాన్యం ఇచ్చింది ఒకరికి... బియ్యం అడుగుతుంది మరొకరిని...!

హుజూరాబాద్, ఆగస్టు 5: జిల్లా సివిల్ సప్లయిస్ అధికారుల నిర్లక్ష్యంతో సీఎంఆర్ ధాన్యం మాయమైంది. హుజూరాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ సమీపంలో పరమేశ్వర ఇండస్ట్రీస్ యజమాని ఓరుగంటి సమ్మిరెడ్డి 2016లో తన మిల్లును సత్యనారాయణ అనే వ్యాపారికి లీజ్‌కు ఇచ్చాడు. అప్పటి నుంచి సమ్మిరెడ్డి అనారోగ్య కారణంగా హైద్రాబాద్‌లో కొడుకుల వద్ద ఉంటున్నాడు. ఇదే అదునుగా చూసుకొని సత్యనారాయణ మిల్లు యజమాని సమ్మిరెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసి ప్రతి ఏటా ప్రభుత్వం నుంచి ధాన్యాన్ని తీసుకుని బియ్యాన్ని ప్రభుత్వానికి పెడుతున్నాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో ఉన్న ధాన్యం రికవరీ చేయాలని సివిల్ సప్లయిస్ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో 2022 సంవత్సరానికి సంబంధించిన సుమారు రెండు కోట్ల రూపాయల ధాన్యం సత్యనారాయణ బాకీ ఉన్నట్లు తేలింది. సివిల్ సప్లయిస్ అధికారులు వచ్చి మిల్లును తనిఖీ చేయగా, ధాన్యం మొత్తం అమ్ముకున్నట్లు తెలిసింది. ఇంతలోనే సదరు వ్యాపారి సత్యనారాయణ అనారోగ్యానికి గురై కోమాలోకి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న సివిల్ సప్లయిస్ అధికారులు సత్యనారాయణకు నోటీసులు పంపించినా ఎవరు స్పందించలేదు. ప్రతి ఏటా మిల్లులో ధాన్యం ఉందా లేదానని చూసుకోవాల్సిన సివిల్ సప్లయిస్ అధికారులు అటూ వైపు కన్నెత్తి చూడలేదు. అనంతరం సివిల్ సప్లయిస్ అధికారులు మిల్లు యజమాని సమ్మిరెడ్డి వద్దకు వెళ్లి 16 ఏసీకేల బియ్యం సత్యనారాయణ ప్రభుత్వానికి బకాయి ఉన్నాడని, దానిని నువ్వే చెల్లించాలని సమ్మిరెడ్డిని హెచ్చరించారు. తనకు వడ్లతో సంబంధం లేదని, సత్యనారాయణను అడగాలని తెలిపినా సమ్మిరెడ్డికి సివిల్ సప్లయిస్ అధికారులు నోటీసులు పంపించారు. ఈ విషయంపై తనకు సంబంధం లేదని సమ్మిరెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సివిల్ సప్లయిస్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి తప్పులు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సివిల్ సప్లయిస్ అధికారులపై సమగ్ర విచారణ జరపాలని మిల్లు యజమాని సమ్మిరెడ్డి కోరారు.



వాగులో పడి వ్యక్తి మృతి

ఓదెల, ఆగస్టు 5: మండలంలోని పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి రాజేశం (45) హుస్సేన్ మియా వాగులో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేశం ఆదివారం ఉదయం 10 గంటలకు పొలం పనులకు అని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోగా కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం హుస్సేన్‌మియా వాగులో శవం తేలిఉండటంతో మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

'ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి'

రామడుగు, ఆగస్టు 5: వెలిచాల గ్రామానికి చెందిన కుతాడి కనకయ్యను గొర్రెల దొంగతనం చేశానని ఒప్పుకోవాలని హింసించిన రామడుగు ఎస్ఐ సురేందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ సంఘాల నాయకులు సోమవారం సీపీ అభిషేక్ మొహంతికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి తిప్పరపు సురేష్, న్యాయవాదుల సంఘం నాయకుడు బీఆర్ఎస్ చొప్పదండి నాయకుడు కట్టెకోల లక్ష్మణ్‌కుమార్, కొంపల్లి సాగర్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య



రాజశేఖర్ (ఫైల్)

కొడిమ్యాల, ఆగస్టు 5: మండలంలోని పూడూర్ గ్రామంలోని బీరప్పస్వామి గుడి సమీపంలో అదే గ్రామానికి చెందిన కందుల రాజశేఖర్ (30) సోమవారం తెల్లవారుజామున దారుణ హత్యకు గురయ్యాడు. కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ తెలిపిన వివరాల మేరకు పూడూర్ గ్రామానికి చెందిన కందుల రాజశేఖర్ గ్రామంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన రాజశేఖర్ తిరిగి రాకపోవడంతో సోమవారం వేకువజామున అతడి తల్లి ఆచూకీ తెలుసుకునేందుకు వెళ్లింది. ఇంటి సమీపంలోని బీరప్పస్వామి గుడి వద్ద రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉన్న కొడుకును గుర్తించింది. గుర్తు తెలియని వ్యక్తులు రాజ శేఖర్ తలపై కట్టెతో కొట్టి, నోట్లో మట్టి పోసి హత్య చేశారు. అనంతరం నిందితులు రాజశేఖర్ ద్విచక్ర వాహనం నుంచే పెట్రోలు తీసి శరీరంపై పోసి కాల్చడానికి ప్రయత్నించారు. పోలీసుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి చేరుకుని వివరాలు సేకరించారు. రాజశేఖర్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు క్లూస్ టీం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. హత్య జరిగిన సమీప ప్రాంతాల్లో కొద్ది రోజులుగా కొందరు యువకులు గంజాయి తీసుకుంటున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

తమ కుమారుడిని హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కరీంనగర్ జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న పూడూర్‌లో ధర్నా చేశా రు. సమాచారం అందుకున్న మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ అక్కడికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నిందితులను పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ధర్నాను విరమించారు.

రెస్టారెంట్ యజమాని ఆత్మహత్య



లక్ష్మీరాజం (ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 5: వ్యాపారంలో నష్టం వచ్చిందని మనస్తాపంతో సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌లో కొండ లక్ష్మీరాజం (36) అనే రెస్టారెంట్ అండ్ బేకరీ యజమాని సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన లక్ష్మీరాజం సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లో నివాసం ఉంటూ గాంధీనగర్ కూరగాయల మార్కెట్ వీధిలో అన్‌లిమిటెడ్ రెస్టారెంట్, బెకరీని నడిపిస్తున్నాడు. వ్యాపారానికి రూ.40 లక్షల వరకు పెట్టుబడి కావడంతో అప్పులు చేశాడు. దీంతో తనకు వంశపారంపర్యంగా వచ్చిన స్థలాలను విక్రయించి అప్పులు తీర్చేశాడు. వ్యాపారంలో నష్టం రావడం, ఆస్తి విక్రయించడంతో మనస్తాపం చెందాడు. ఎప్పటిలాగే తన ఇద్దరు కూతుళ్లను స్కూల్‌లో దింపేసి గాంధీనగర్‌లో ఉన్న హోటల్‌కు చేరుకొని వెనుక గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కొంత కాలంగా హోటల్‌లో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులతో తన భర్త లక్ష్మీరాజం ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య వైశాలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

నకిలీ ఫోన్‌పే యాప్‌తో యువకుడి మోసం

మంథని, ఆగస్టు 5: నకిలీ ఫోన్ పే యాప్ ద్వారా మోసానికి పాల్పడుతున్న ఓ యువకుడిని మంథనిలో పట్టుకున్నారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ అనే యువకుడు ఈజీ మనీకి అలవాటు పడి ఫేక్ ఫోన్ పే యాప్‌ను తన ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. ఈ నకిలీఫోన్ పే ద్వారా ట్రాన్సాక్షన్ చేసినట్టు మాత్రమే కన్పిస్తుంది కానీ ఎదుటి వారి ఖాతాలో ఎలాంటి డబ్బులు జమ కావు. ఈ యాప్ ద్వారా రాజ్‌కుమార్ పట్టణంలోని త్రినేత్రి ఆన్‌లైన్ షాపులోని స్కానర్‌కు డబ్బులు పంపించాడు. ఆన్‌లైన్ ద్వారా రూ. 5 వందలు చెల్లించానని, డబ్బులు ఇవ్వాలని కోరాడు. తన ఖాతాలోకి డబ్బులు జమ కాకపోవడంతో అనుమానం వచ్చిన షాపు నిర్వాహకుడు అంబటి సాయి తన స్నేహితుల సాయంతో అది ఫేక్ యాప్ అని నిర్ధారించుకొని అతన్ని పట్టుకున్నాడు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించగా పోలీసులు నిందితుడిని పోలీస్టేషన్‌కు తలించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మంథనిరూరల్, ఆగస్టు 5: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దాసరి ఓదెలు(60) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య దాసరి లక్ష్మి కథనం ప్రకారం.. ఓదెలు 5 సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడని, ఆదివారం మధ్యాహ్నం తమ పత్తి చేను నుంచి వెళ్లిన ఓదెలు పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని తెలిపింది. చికిత్స కోసం మంథనికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించామని చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపింది.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 5: భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని మానసిక వేదనకు గురైన వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసింది. ఆరోగ్యం క్షీణించి సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లద్నాపూర్ గ్రామానికి చెందిన పులి లక్ష్మీ తన కూతురు నవ్యను పెద్దపల్లి మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన బాలసాని జంపయ్యకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. భర్త జంపయ్య వేరే మహిళతో సంబంధం పెట్టుకోగా విషయం తెలిసిన బాలసాని నవ్య (35) మనస్తాపానికి గురై జూలై 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లో చికిత్స అందించారు. అయినా ఆరోగ్యం క్షీణిస్తుండటంతో హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఆర్థికస్తోమత లేకపోవడంతో స్వగ్రామం ముత్తారం తీసుకొచ్చారు. ఆరోగ్యం క్షీణించి ఆదివారం రాత్రి మృతి చెందినట్లు మహిళ కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

చిరుత దాడిలో దూడ మృత్యువాత

గంభీరావుపేట, ఆగస్టు 5 : మండలంలోని దమ్మన్నపేట సమీపాన ఆదివారం రాత్రి చిరుత దాడి చేసి దూడను చంపేసింది. గోరంటాల గ్రామ సమీపంలో ఇటీవల చిరుత దాడిలో రెండు ఆవులు చనిపోయిన సంఘటన మరవక ముందే దమ్మన్నపేట గ్రామ సమీపాన వీరబోయిన నారాయణ అనే రైతుకు చెందిన దూడ చిరుత దాడిలో మృతి చెందింది. పెద్దమ్మ అటవీ ప్రాంత శివారు గ్రామాలైన గోరంటాల, దమ్మన్నపేట రైతులకు చెందిన మూగజీవాలను చిరుత చంపుతుండడంతో భయందోళనలు నెలకొన్నాయి. ఫారెస్ట్ అధికారులు స్పందించాలని, చిరుత బారి నుంచి కాపాడాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. సంఘటన స్థలాన్ని డిప్యూటీ రేంజ్ అధికారి అంజలి, బీట్ ఆఫీసర్ రమేష్ పరిశీలించారు.

'అల్ఫోర్స్'లో ఫ్రెషర్స్‌డే హంగామా



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 5: అల్ఫోర్స్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థులు హంగామా సృష్టించారు. ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో అల్ఫోర్స్ ఎక్సెల్ పేరుతో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలను అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా లక్ష్యాలను అధిగమించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యాలు, నాటికలు, అలరించాయి. ఈ సందర్భంగా వివిధ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో సీట్లు పొందిన విద్యార్థులను సన్మానించారు.

మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ సాధ్యం

హుజూరాబాద్, ఆగస్టు 5: మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ సాధ్యమని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ జీనీయస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో ఇందిర వన ప్రభ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి ఘన స్వాగతం



గజమాలతో ఎమ్మెల్యే కవ్వంపల్లి ని సన్మానిస్తున్న మాదిగ సామాజిక వర్గ నాయకులు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 5: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం మొదటిసారి నియోజకవర్గానికి వచ్చిన మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు బెజ్జంకి స్టేజ్ దగ్గర మాదిగ సామాజికవర్గ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికి అల్గునూర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రేణికుంట టోల్ గేట్ వద్ద భారీ గజమాలతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. అనంతరం అల్గునూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 16న లేదా 17న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగ సమ్మేళనం కార్యక్రమానికి వేలాదిగా తరలిరావాలని, ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తామన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా కన్న కృష్ణ



అధ్యక్షుడు కన్న కృష్ణ



ప్రధాన కార్యదర్శి వెంకటేశం



కోశాధికారి శ్రీనివాస్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 5: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్, బీజేపీ నాయకుడు కన్న కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కొమురవెల్లి వెంకటేశం, కోశాధికారిగా పడకంటి శ్రీనివాస్ నియమితులైనట్లు ఆర్యవైశ్య మహాసభ ప్రకటించింది. ఇటీవల అధ్యక్ష పదవికి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయగా కేవలం కన్న కృష్ణ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో మహాసభ ఆయనను ఎన్నికైనట్లు ప్రకటించింది. ఆయన ప్రధాన కార్యదర్శిగా కొమురవెల్లి వెంకటేశం, కోశాధికారిగా పడకంటి శ్రీనివాస్‌ను నియమించారు. ఈ సందర్భంగా నగరంలోని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘాల ప్రతినిధులు గజవాడ ఆంజనేయులు, యాంసాని అశోక్, మాదూరి మల్లేశం, సూర శ్రీనివాస్, కొల్లూరి హరిప్రసాద్, గుండ సత్తయ్య, నలుమాచు విజయ్, సామ లక్ష్మన్, పాత రాధాకిషన్, యాసంఆని అశోక్, దొంతుల మనోహర్, పైడ శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, సాయికృష్ణలు నూతనంగా ఎన్నికైన జిల్లా సంఘం పీఎస్‌టీలకు అభినందనలు తెలిపారు.

రూ. 7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 5: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు ముగ్గురు రైతులు 33 క్వింటాళ్ల విడి పత్తి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 7,350, కనిష్ఠ ధర 6,500 రూపాయలు చెల్లించి కొన్నారు.

నేడు గద్దర్ వర్ధంతి సభ

జమ్మికుంట రూరల్, ఆగస్టు 5: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గద్దర్ ప్రథమ వర్ధంతి సభను మంగళవారం నిర్వహిస్తున్నామని ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామంచ భరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, సంఘాల నాయకులు, యువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 5: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని వీఎస్ఆర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శనిగరపు రజిత అన్నారు. మండలంలోని సింగాపూర్ వీఎస్ఆర్ కళాశాలలోని ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కిట్స్ రిజిస్టర్ డాక్టర్ వి రాజేశ్వర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్, ఆగస్టు 5: హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి జాతీయ వారోత్సవాల వాల్ పోస్టర్‌ను సోమవారం జై గౌడ ఉద్యమం సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 11న హైద్రాబాద్‌లోని రవీంద్ర భారతిలో జయంతి వారోత్సవాల కార్యక్రమానికి గౌడ సంఘం నాయకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జై గౌడ ఉద్యమం జిల్లా అధ్యక్షుడు అనపురం తిరుపతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కందాల రాజు, శ్రీపతి కుమార్, కొంరయ్య, రాజమౌళి, సారయ్య, మొగిలి, రఘుపతి, శ్రీకాంత్, కిరణ్‌కుమార్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

గంగాధర ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా రాజిరెడ్డి

గంగాధర, ఆగస్టు 5: గంగాధర మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షు డిగా జారతి రాజిరెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం గంగాధరలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షు డిగా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బేతి గంగాధర్, ఉపాధ్యక్షు లుగా కట్ల మల్లేశం, మేడి ప్రసాద్, అధికార ప్రతినిధిగా బూరుగు ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడిగా రాళ్లబండి జనార్దన్‌రెడ్డి, కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంబేద్కర్ కాలనీలో వైద్య శిబిరం



కాలనీవాసులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జమ్మికుంట, ఆగస్టు 5: పట్టణ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు ఆందజేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, వర్షకాలంలో వచ్చే వ్యాదులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మహోన్నత, మహిళ కౌన్సిలర్ పూలమ్మ, సూపర్‌వైజర్ రత్నకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పవర్‌లూం కార్మికుల కూలి రేట్లు పెంచాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్

కరీంనగర్ రూరల్, ఆగస్టు5: పవర్‌లూం కార్మికుల కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ కోరారు. సోమవారం కరీంనగర్ మండల పరిదిలోని చామనపల్లి, చెర్లబూత్కూర్, ఎలబోతారం, జూబ్లీనగర్ పవర్‌లూమ్ కార్మికుల సమ్మె 22వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా చామనపెల్లి గ్రామంలో జరుగుతున్న సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. పోరాటాల ద్వారానే గతంలో ఎన్నో సార్లు కూలి రేట్లు సాదించుకున్నామని అన్నారు. పోరాటాల ద్వారానే గతంలో 8సార్లు వేతన ఒప్పదం చేసుకోవడం జరిగిందని తెలిపారు. కేసులను సైతం ఎదుర్కొని అనేక కష్టాలను అనుభవించి ఒప్పందం చేసుకున్న చరిత్ర పవర్‌లూమ్ కార్మికులకు ఉన్నదని పేర్కొన్నారు. అదే స్పూర్తితో సమ్మెను కొనసాగించాలని కోరారు. 22రోజులుగా సమ్మె జరుగుతుంటే యజమానులు, కార్మిక శాఖ అధికారులు ఎలాంటి చర్చలకు ఇప్పటి వరకు పిలవకపోవడం చాలా శోచనీయమన్నారు. వెంటనే యజమాన్యాలు మొండివైఖరిని వీడి యూనియన్‌తో చర్చలు జరిపి కూలి రేట్లను పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ కోరారు. ఈవిషయంలో కార్మిక శాఖ అధికారులు జోక్యం చేసుకుని వెంటనే సమస్యను పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్, పవర్‌లూమ్ కార్మిక సంఘం అధ్యక్షుడు దూడం గంగాధర్, నాయకులు రాజు, మల్లేశం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు ఘన స్వాగతం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 5: రాష్ట్రంలో పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా అమెరికా వెళ్లిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుకు న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే ఎయిర్‌పోర్టులో మాజీ పార్లమెంట్ సభ్యులు జువ్వాడి చొక్కారావు మనవడు కరీంనగర్ పార్లమెంట్ మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జువ్వాడి నిఖిల్‌చక్రవర్తి ప్రవాస భారతీయులతో కలిసి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సంక్షేమ పరిపాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి వర్గానికి జువ్వాడి నిఖిల్‌చక్రవర్తి ధన్యవాదాలు తెలిపారు.

'ముఖ్యమంత్రి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం'

సుభాష్‌నగర్, ఆగస్టు 5: యూనివర్సిటీ పేరు మార్పు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని వైశ్యసేవా సంఘం అధ్యక్షుడు చిదుర సురేష్ అన్నారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భాష ప్రతిపాదికన ఏర్పాటైన పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ అని నాటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు ఏర్పాటు చేశారని అన్నారు. నాటి నుంచి అనేక సేవలందిస్తూ, వైశ్యాజాతి గౌరవాన్ని ఇనుమడింప చేస్తున్నారని అన్నారు. అలాంటి యూనివర్సిటీకి పెట్టిన పొట్టిశ్రీరాములు పేరును మారుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అన్ని నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి ముస్త్యాల రమేశ్, డైరెక్టర్లు ఎలగందుల మునీందర్, తొడుపునూరి హరి, కైలాస నవీన్, తాటిపెల్లి సుభాష్, పల్లెర్ల శ్రీనివాస్, రామిడి శ్రీధర్, బొల్లం శ్రీనివాస్, గౌరిశెట్టి సుమన్, జిడిగె సాయికృష్ణ, ఎలుగూరి రవి తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి తరలిన బీసీ నాయకులు

గణేశ్‌నగర్, ఆగస్టు 5: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో ఆగస్టు 6,7వ తేదీలలో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి సోమవారం జిల్లా నుంచి బీసీ సంఘం నాయకులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్, బీసీ మహిళ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు గుంటి స్వరూప,బీసీ విద్యార్థి సంఘం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు మల్యాల సంజీవ్, ఆధ్వర్యంలోజిల్లా నాయకులు చలో ఢిల్లీ కార్యక్రమానికి భారీగా తరలి వెళ్లారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు 50 శాతంరిజర్వేషన్ కల్పించాలని కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని జనగణనలో కులగణన దేశవ్యాప్తంగా చేపట్టాలని, ప్రభుత్వ ఉద్యోగాలలో క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని అనే తదితర ప్రధాన డిమాండ్లతో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సారైనా కేంద్రంలో బీసీ ప్రధాన మంత్రి మూడోసారి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాతప్రధాని నరేంద్ర మోడీ బీసీ ల అభివృద్ధి కి పాటుపడాలని కోరారు. బీసీ సంఘం నాయకులు అనుమస నితిన్, నల్లగోని శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్,కాటా వేణుగోపాల్, నార్ల శ్రీకాంత్, నల్లగోని శ్రీకాంత్,అజయ్ ఉన్నారు.

మానసిక ఒత్తిడిపై విద్యార్థులకు అవగాహన

వీణవంక, ఆగస్టు 5: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మానసిక ఒత్తిడి నివారణ అంశంపై సైకాలాజిస్ట్ రమణారెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన ఇంటి గోడ

గన్నేరువరం, ఆగస్టు 5: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గర్శకుర్తి సత్తయ్యకు చెందిన ఇంటి గోడ కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడికి నివాళి

చొప్పదండి, ఆగస్టు 5: కాంగ్రెస్ ఆర్నకొండ అధ్యక్షుడు ఎల్లాల ఆదిరెడ్డి సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌గా సువార్త



అదనపు కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 5: నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌గా సువార్త బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్‌లో పనిచేస్తున్న సువార్తను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనితో ఆమె సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్‌తో పాటు పలు విభాగాల సెక్షన్ హెడ్స్, అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ సువార్త మాట్లా డుతూ ప్రతి ఉద్యోగి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, ఏమైనా సమస్యలుంటే తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఆంజనేయులు, గణేశ్‌రెడ్డి, డీఈ ఓంప్రకాశ్, టిపిబివో వేణు పాల్గొన్నారు.

కేరళ వరద బాధితులను ఆదుకోవాలి

భగత్‌నగర్, ఆగస్టు5: కేరళ వాయనాడులో వరద బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కేరళ వరద బాధితుల సహాయార్థం కలెక్టరేట్‌లో విరాళాలు సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాటాడుతూ వరదలతో వాయనాడు ప్రజలు వణికి పోతున్నారన్నారు. ఇప్పటివరకు 300కు పైగా చనిపోయారని, కేరళ ప్రభుత్వం సహాయక చర్యలు ముమ్మరం చేసిందన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కేంద్రం బాధ్యత నుండి తప్పుకుని రాజకీయాలుఉ మాట్లాడడం సరికాదన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి కేంద్రం సాయం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, నరేష్‌పటేల్, పార్టీ నాయకులు వడ్లరాజు, రాయికంటి శ్రీనివాస్, గోరేమియా, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి



ఆర్‌డీవోకు వినతిపత్రం ఇస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు

సుభాష్‌నగర్, ఆగస్టు5: విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌కు పాలక వర్గం ఏర్పాటు చేసి, తక్షణమే రూ.1000కోట్లు నిధులు మంజూరు చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కన్వీనర్ శ్రీరామోజు రవీంద్రాచారి కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్‌డీవోకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ర, ఇనుము, శిల్పి, ఇత్తడి, స్వర్ణకార వంటి వృత్తిపనులు చేసుకునే వారి దుకాణాలకు ఉచిత విద్యుత్, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, నెలకు రూ. 5000పెన్షన్ ఇవ్వాలని కోరారు. అంతే కాకుండా అర్హులైన విశ్వబ్రాహ్మణ వేద పురోహితులను దేవాల యాల్లో అర్చకులుగా నియమించాలని, కట్టెకోత మిషన్లకు ఉచిత పర్మిట్లు, శిల్పులకు శిలలు తెచ్చుకోవడానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. దొంగ బంగారం రికవరి చట్టంలో మార్పులు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండోజు లక్ష్మయ్య శేకల్ల హరిచారి, రాష్ట్ర కార్యదర్శి ఊకంటి ఓంకార్, రంగు భాస్కరాచారి, నగర కన్వీనర్ తిప్పారపు శ్రీనివాస్, జిల్లా కో కన్వీనర్లు కొత్తపల్లి బ్రహ్మచారి, కనపర్తి సత్యనారాయణ, నాగసముద్రం శ్రీనివాస్, గాలిపెల్లి రమేశ్, నందగిరి బలరాం, ఎస్ రవిచంద్ర, పట్టణ కో కన్వీనర్లు కలికోట మోహన్, కడార్ల సునీల్, దుర్శెట్టి కృష్ణ, శ్రీమంతుల సదాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు పట్టించాలి



హుజూరాబాద్‌లో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న అధికారులు

హుజూరాబాద్, ఆగస్టు 5: పట్టణంలోని అంగన్‌వాడీ-2 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సుగుణ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంట లోపే ముర్రుపాలు పట్టాలన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు జయ, అరుణ, పద్మ, సుకన్య, సబిత, పావని, సంధ్య పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం గ్రామంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్రవంతి, జిల్లా మహిళ సాధికారిక కేంద్రం జెండర్ స్పెషలిస్టు కవిత, వైద్యాధికారి శ్రావణ్, పంచాయతీ కార్యదర్శి రాధిక, అంగన్‌వాడీ టీచర్ పద్మ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

హుజూరాబాద్, ఆగస్టు 5: ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్ పోలీసులు వెతికి అప్పగించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. హుజూరాబాద్ పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద అనుపు రాజు ప్రమాదవశాత్తు సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. టౌన్ సీఐ తిరుమల్ క్రైమ్ పార్టీ ద్వారా పోయిన సెల్‌ఫోన్‌ను వెతికించి బాధితుడు రాజుకు అప్పగించారు. దీంతో రాజు సీఐ తిరుమల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, ఆగస్టు 5: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకిని రమేష్ ఆధ్వర్యంలో డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో శ్రవణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గా భవానికి 108 చీరలతో అలంకరణ

కరీంనగర్ రూరల్, ఆగష్టు 5: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా కరీంనగర్ మండలం నగునూర్ శ్రీదుర్గాభవానీ ఆలయంలో మంగళవారం అమ్మవారికి 108 చీరలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సౌందర్య లహరి పారాయణం, అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు జరపనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించాలని కోరారు.

నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

గణేశ్‌నగర్, ఆగస్టు 5: నగరంలోని 50వ డివిజన్ పరిధిలోని ఒడిసి స్కూల్ అపోజిట్ గల్లీలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ప్రారంభించారు. దీంతో ఓవర్ లోడ్ ఓల్టేజీ సమస్య అధిగమించవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ విద్యాసాగర్, ఎస్ఎల్ఎం శ్రీనివాస్,లైన్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, లైన్‌మెన్ శ్రీకాంత్, జేఎల్ఎం, సాయిరాం, 50వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక అంజయ్య పాల్గొన్నారు.

సామూహిక అన్నప్రాసన

కరీంనగర్ టౌన్, ఆగస్టు 5: కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అర్బన్ మండలం మారుతీనగర్ సెక్టార్ హౌజింగ్‌బోర్డు కాలనీలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సామూహిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం జరిగిన ఈకార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి, డిడబ్ల్యూవో సరస్వతి, కార్పొరేటర్ ఆకుల పద్మ ప్రకాశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గూడెల్లి రాజ్‌కుమార్, హరికృష్ణ, ఎఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు వసంత, రమ, ఉమ, కృష్ణవేణి, విజయ, కవిత, మంజు, పిల్లలు, తల్లులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రజకులకు పనికి తగ్గ వేతనంచెల్లించాలి

కరీంనగర్‌టౌన్, ఆగస్టు 5: జిల్లాలోని కాలేజీలు, హాస్టళ్ళలో పనిచేస్తున్న రజకులకు పనితగ్గ వేతనాలు చెల్లించాలని తెలంగాణ రజక సంఘం డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రజక సంఘం ముఖ్యనాయకుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ మాట్లాడుతూ ప్రైవేట్ కాలేజీలు, హాస్టల్సలో పని చేస్తున్న రజకులకు తక్కువ వేతనాలు ఇస్తూ యాజమాన్యాలు శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయన్నారు.

'విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్'

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 5: విద్యా వ్యవస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు.

అనాథ శరణాలయంలో స్వీట్లు పంపిణీ

జమ్మికుంట రూరల్, ఆగస్టు 5: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల స్పందన అనాద శరణాలయంలో బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి రాజేష్ ఠాకూర్ జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 5 : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరగనున్నట్లు ఎంపీడీవో సునీత ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

వీణవంక, ఆగస్టు 5: మండల కేంద్రానికి చెందిన కోరె కళావతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులకు యాప్ టీవి అధినేత పాడి ఉదయనందన్‌రెడ్డి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అనుచరుల ద్వారా అందించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

● చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తికి చెందిన కళాకారుడు అనగోని పర్షయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం శ్రీ లక్ష్మీగణపతి యూత్ ఆధ్వర్యంలో అయన కుటుంబసభ్యులకు నిత్యావసర వస్తువులు, ఆర్థిక సహాయం అందించారు.

● సైదాపూర్: వెన్కేపల్లి పాఠశాలపూర్వ విద్యార్థి గొడిశాల శ్రీలత భర్త ఇటీవల మృతి చెందాడు. ఆమెతో చదువుకున్న పూర్వ విద్యార్థులు శ్రీలతకు రూ.25వేల ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు సోమవారం అందజేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి
- జిల్లా వ్యాప్తంగా 'స్వచ్ఛదనం-పచ్చదనం'
- గ్రామాల్లో ర్యాలీలు







మల్కాపూర్‌లో మొక్కలు నాటుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, హుజూరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, చొప్పదండిలో మొక్కను నాటుతున్న చైర్‌పర్సన్ గుర్రం నీరజ

భగత్‌నగర్, ఆగస్టు 5: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామంలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీని ఆయన సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ప్రధానోపాధ్యాయుడు స్వదేశ్‌కుమార్, ఏపీవో స్రవంతి, పంచాయతీ కార్య దర్శి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఈశ్వర్‌గౌడ్, శ్రీనివాస్, శంకర్, కీర్తికుమార్ పాల్గొన్నారు.

- కొత్తపల్లి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు అన్నారు. సోమవారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.

● కరీంనగర్ రూరల్: గ్రామాల్లో స్వచ్ఛదనం- పచ్చదనం పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆర్డీవో కె మహేశ్వర్ అన్నారు. మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఏపీవో జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

● హుజూరాబాద్: పట్టణంలోని అన్ని వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక ఆధ్వర్యంలో స్వచ్ఛదనం...పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్‌పర్సన్ నిర్మల, సాంబరాజు, బషీర్, కిషన్‌రావు, అశ్విన్‌గాంధీ పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడం అలవాటుగా చేసుకోవాలని ఆర్డీవో రమేష్ అన్నారు. సోమవారం మండలం లోని కందుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునిత, ఎంపీవో సతీష్, హెచ్ఎం మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేకాధికారి నాగార్జున, ఎంపీడీవో కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

● వీణవంక: మండల కేంద్రం స్పెషల్ ఆఫీసర్ డి కొంరయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, ఎంపీ వో సురేందర్, అబ్దుల్ అఖీమ్, కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, హెచ్ఎం పులి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

● గంగాధర: స్వచ్ఛదనం-పచ్చదనంలో ప్రతి ఒక్కరిని బాగస్వామ్యులను చేయా లని జడ్పీ సీఈవో శ్రీనివాస్ అన్నారు. మండలవ్యాప్తంగా స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుపమ, ఇన్‌చార్జి ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

● గన్నేరువరం: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామానుజాచారి, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: పట్టణ పరిధిలోని 30 వార్డుల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లిలో పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శైలజాదేవి, పంచాయతీ కార్యదర్శి స్వప్నప్రియ, ఏఎన్ఎం శ్యామల, కారోబార్ రాజేశ్వర్‌రావు, అంగన్‌వాడీ టీచర్లు సంధ్య, రజిత, సీఏ రజిత పాల్గొన్నారు.

● సైదాపూర్: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలు, ప్రభుత్వ జూనియర్ కాళాశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రావు, నాయకులు దొంత సుధాకర్, పులి ఆంజనేయులు, రాఘవులు, మిట్టపెల్లి కిష్టయ్య, మల్లయ్య, కూతురు విద్యాన్‌రెడ్డి, యాదగిరి, రాజు పాల్గొన్నారు.

● రామడుగు: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గండి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాష్, ఎంపీడీవో రాజేశ్వరి, మెడికల్ ఆఫీసర్ గ్రీస్మానియా, గ్రామ ప్రత్యేకాధికారి యాస్మిన్ పాల్గొన్నారు.

● చొప్పదండి: పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, ఎస్ఐ అనూష, కమిషనర్ నాగరాజు, వైస్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, హెచ్ఎం రాజిరెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు చొప్పదండికి చెందిన గుర్రం చిన్నఎల్లారెడ్డి ట్రస్ట్ తరపున రెయిన్ కోట్స్ అందజేశారు.

● చిగురుమామిడి: మండల వ్యాప్తంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు.

● ఇల్లందకుంట: స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సోమవారం ప్రారంభించారు.